

ఎస్పీఎం కార్మికులే కీలకం





- కార్మిక క్షేత్రంపైనే నాయకుల దృష్టి
- విజయావకాశాలపై ప్రభావం చూపనున్న కార్మిక ఓటర్లు
- 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఎఫెక్ట్‌తో అప్రమత్తం

కాగజ్‌నగర్, మే 3: త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కార్మికక్షేత్రంలో ఓట్లను రాబట్టుకునేందుకు ఆయాపార్టీల నాయకులు ప్రధానంగా దృష్టిసారిస్తున్నారు. జిల్లాలో కాగజ్‌నగర్‌లో ఎస్పీఎం, సర్‌సిల్క్ మిల్లులు ఉండటం, ఇందులోని కార్మిక కుటుంబాల ఓట్లను రాబట్టేందుకు ప్రధాన పార్టీలు వ్యూహారచనలు చేస్తున్నాయి. రెండు నెలల క్రితం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎస్పీఎం మిల్లు కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను ఓపిగ్గా విన్నారు. ఎంపీ ఎన్నికలు కాగానే సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కాంగ్రెస్‌పార్టీ నాయకులు కూడా కార్మిక వాడల్లో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కూడా మిల్లు పునరుద్దరణ తామే చేశామని కార్మికులకు వివరిస్తూ తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు.

ప్రత్యక్షంగా, పరోక్షంగా 20వేల ఓటర్లు..

ఎస్పీఎం మిల్లులో కార్మికులు, స్టాఫ్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు మొత్తం కలిపి 2వేలకుపైగా ఉన్నారు. ఓల్డుకాలనీ, న్యూకాలనీ, ఎటైపు, బీటైపు, సీటైపు, డీటైపు, రామ గుండం పవర్ హౌజ్‌కాలనీ, ఓఆర్టీ క్వార్టర్లలో కార్మికులు, ఎస్పీఎం స్టాఫ్ ఉద్యోగులు నివసిస్తున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, మండలాల్లో మొత్తం 90,875ఓటర్లు ఉండగా, ఇందులో 12వేలకుపైగానే ఓటర్లు ఎస్పీఎంలో పనిచేస్తున్న కార్మిక, కుటుంబ సభ్యులే. అలాగే సర్‌సిల్క్ మిల్లు కార్మికులు కూడా 10వేల మంది ఉన్నారు. వీటితో పాటు మిల్లులపై ఆధారపడి చిరువ్యాపారులు, ఇతర సంస్థల వారిని కలుపుకొంటే మొత్తం 20వేలకు వరకు ఓటర్లు ఉంటారు. ఈ ఓట్లను తమవైపు తిప్పుకునేందుకు పార్టీలు తమ వ్యూహ రచన చేస్తున్నాయి.

ఎస్పీఎంలో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఆత్రం సక్కుకు ఓటేయాలని కోరుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి సిర్పూరు మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప, రావి శ్రీనివాస్ తదితరులు కూడా కార్మిక ప్రాంతాల్లో పట్టు సాధించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ నుంచి సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు వివిధ కాలనీల్లో ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను గెలిపించాలని ఇంటింటా తిరుగుతున్నారు. ఇలా అభ్యర్థుల గెలుపు ఓటములు నిర్ధేశించడంలో కార్మిక క్షేత్రం కాబట్టి వీరి ఓట్లే కీలకం కానున్నాయి. 2018అసెంబ్లీ ఎన్నికల్లో కాగజ్‌నగర్‌లో సింహభాగమైన కార్మికప్రాంతం నుంచి ఒకేవైపు ఓట్లు పడ్డాయి. దీంతో అప్పటి అభ్యర్థి కోనేరు కోనప్పకు సిర్పూరు నియోజకవర్గంలోని ఏడు మండలాల కంటే అధికంగా ఇక్కడి నుంచే లీడ్ వచ్చింది.

అలాగే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడిఓట్లు చీలి పోయాయి. ఫలితంగా ఆశించిన ఫలితాలు పూర్తిగా తారుమారయ్యాయి. ఈ గణాంకాల ఆధారంగానే అన్ని పార్టీల రాజకీయ నాయకులు కార్మికఓటర్లపైనే దృష్టిసారించారు. గతంలో జరిగిన పోలింగ్ కంటే ఈసారి పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకుగాను డిపార్టుమెంట్ల వారీగా కీలకమైన వ్యక్తులు మంతనాలు జరుపుతున్నారు. కార్మికుల ఓట్లు రాబట్టేందుకు ఆయా రాజకీయ పార్టీ నాయకులు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు.

జిల్లా జోలికి వస్తే ఊర్కునేది లేదు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, మే 3: చిన్న జిల్లాలను కుదించడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రపన్నుతున్నదని ఆదివాసీల జిల్లా ఆసిఫాబాద్‌కు జోలికివస్తే ఊర్కునేది లేదని ఎమ్మెల్యే కోవలక్ష్మి మండిపడ్డారు. శుక్రవారం ఎమ్మెల్యే తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం పరిపాలన కోసం అప్పటి సీఎం కేసీఆర్ చిన్నజిల్లాల ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలఏర్పాటుతో ప్రజలకు పరిపాలనపరంగా అన్నిసౌకర్యాలు కలుగుతున్నాయన్నారు. జిల్లాకు ఒకమెడికల్ కళాశాలతో ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం చిన్న జిల్లాలను కుదించేందుకు యోచిస్తోందని అన్నారు. ఆదివాసీలు అధికంగా నివసించే కుమరంభీం జిల్లాను కుదిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊర్కొనేది లేదన్నారు. జిల్లాను కుదిస్తే ఆదివాసీలమంతా ఏకమై ఉద్యమం చేపడుతామన్నారు. జిల్లాను కుదిస్తే ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం ఈ యోచనను మానుకోవాలన్నారు. లేనిపక్షంలో అన్నివర్గాల ప్రజలు ఏకమై ఐక్యపోరాటాలకు సిద్ధమవుతామన్నారు. కాంగ్రెస్ నాయకులను జిల్లాలో తిరగన్వివమని హెచ్చరించారు. చిన్నజిల్లాలను అభివృద్ధి చేయాల్సిందిపోయి కుదిస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేద న్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు అలీబీన్ అహ్మద్, వెంకన్న, రవీందర్, నిసార్, షైమద్, బలరాం పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో పాల్గొనాలి

కెరమెరి, మే 3: ఉపాధి హామీ పనుల్లో పాల్గొనాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. శుక్రవారంమండలంలోని యోడడిగ్రామంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పనికి వెళ్లాలన్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు, చలువ పందిర్లు ఏర్పాట్లు చేశామన్నారు. ఆయనవెంట కార్యదర్శి ధర్మయ్య, టీఏలు,ఎఫ్ఏలు పాల్గొన్నారు.

6న ధ్యాన కేంద్ర వార్షికోత్సవం

కెరమెరి, మే 3: గోయగాంలో పూలాజీబాబా ఆలయం వార్షికోత్సవం ఈనెల 6ననిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు నగేష్, పోశెట్టి తెలిపారు. కార్యక్రమంలో పూలాజీబాబా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- టీజీఎల్ఏ రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్

ఆసిఫాబాద్ రూరల్, మే 3: అందివచ్చిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్(టీజీఎల్ఏ) రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రలోని చైతన్యకళాశాలలో జీజీఎల్ఏ, ఇంపాక్ట్‌సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ పూర్తైన విద్యార్థులకు ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ సంస్థ వారు నిర్వహించిన ఉద్యోగంతో పాటు ఉచిత డిగ్రీప్రవేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్థ వారు నిర్వహించిన పరీక్షలు, ఇంటర్వ్యూలకు 80మంది హాజరుకాగా14మంది ఎంపికైనట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా వెనకబడిన వారికోసం భవిష్యత్‌లో తమ సంఘం ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ ఉషారాణి, ఇంపాక్ట్ సంస్థ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, రాజమౌళి, చంద్రయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం

ఆసిఫాబాద్, మే 3: హజ్‌యాత్ర 2024కు ఆసిఫాబాద్ పట్టణం నుంచి వెళ్లే యాత్రికులు అబ్దుల్ రహెమాన్, షేక్ చాంద్, ముజఫర్ హుస్సేన్‌ను జామియా మజీద్‌కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ప్రపంచంలో శాంతి వాతావరణం ఉండాలని, దేశ అభివృద్ధిలో ముందడుగు వేసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించాలని మజీద్ కమిటీసభ్యులు యాత్రికులను కోరారు. కార్యక్రమంలో జామియా మజీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఫయాజ్, సభ్యులు హకీంఅన్సారీ, సయ్యద్‌జావీద్, సాలం, షబ్బీర్, ఆహ్మద్, షాకీర్, షాహీన్, అమర్ బిన్ హసన్, రియాజ్, అబ్దుల్ బాసిత్, రహమత్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలి

- బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అలిజాపూర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అలిజాపూర్ శ్రీనివాస్

ఆసిఫాబాద్ రూరల్, మే 3: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగ సభకు జిల్లాలోని పార్టీ నాయకులు, ప్రజలు, అభిమానులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అలిజాపూర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఆపార్టీ రాష్ట్ర నాయకులు బోనగిరి సతీష్‌బాబు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా కోకన్వీనర్ మయూర్ చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి అధినాథ్, రాష్ట్ర మహిళామోర్చా నాయకురాలు సిద్దంశెట్టి సుహాసినితో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల5 ఆదివారం ఉదయం 11గంటలకు కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడా మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొని ప్రసంగిస్తారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలు సరైన గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ మునిగిపోయే నావ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 12స్థానాలు కైవసం చేసుకుంటుందన్నారు. బీజేపీ గెలుపుకోసం అమిత్‌షా బహిరంగ సభకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, ప్రసాద్‌గౌడ్, శ్రావణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎం క్రీడామైదానంలో సభ..

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్‌లో ఈనెల 5న ఎస్పీఎం క్రీడామైదానంలో నిర్వహించే వికాస సంకల్పసభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో సంతోష్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వస్తున్నారని తెలిపారు. సభకు అధికసంఖ్యలో ప్రజలను తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు మాట్లాడుతూ సభను విజయవంతం చేసేం దుకు అభిమానులు, కార్యకర్తలు తమవంతు బాధ్యతగా ప్రజ లను తరలించాలన్నారు. ఈ సందర్భంగా వికాస సంకల్ప సభావేదికకు వారు భూమిపూజ చేశారు.



కాగజ్‌నగర్‌లో వికాససంకల్ప సభ నిర్వహించే ప్రాంతంలో భూమిపూజ చేస్తున్న బీజేపీ నాయకులు

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, మే 3: ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి పోస్టల్‌బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ పరిధిలోని ఆసిఫాబాద్ నియోజకవర్గంలో విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ విని యోగించుకునేందుకు జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటరు పెసిలిటేషన్ సెంటర్‌ను అదనపుకలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ నెల3నుంచి 8వరకు ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటలవరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును ఈకేంద్రంలో వినియోగించుకోవాలని తెలిపారు. మొత్తం 2420 మంది ఉద్యోగులు ఈ ఓటరు ఫెసిలిటిటేషన్ సెంటర్‌లో ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ సంద ర్భంగా ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాట్లపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంలో విధులు నిర్వహించే ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు, ఉద్యోగులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: సిర్పూరు నియోజవర్గంలో ఎన్నికల విధుల కోసం 1400మందిని కేటాయించామని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వీరందరి కోసం కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌కేంద్రం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. శుక్రవారం నుంచి ఈనెల8వరకు ఉదయం9నుంచి సాయంత్రం 5గంటలవరకు ఓటు వేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో పోస్టల్ బ్యాలెట్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే



కాగజ్‌నగర్‌లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయిస్తా

- ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్, మే 3: ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ ఎన్నిక చెల్లదంటూ శుక్రవారం రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆది లాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేరే అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ సరిగా జరగలేదన్న కారణంతో ఈ తీర్పు వచ్చినట్టు తెలిపారు. అభ్యర్థి నామినేషన్ ఉప సంహరణకు నాకు సంబంధం లేని వ్యవహారమన్నారు. ఈ తీర్పుపై నాలుగు వారాల గడువు ఉందన్నారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. హైకోర్టు తీర్పుపై స్టేవస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం

జైనూర్, మే 3: మండలంలోని జామ్నీ, రాసిమెట్ట, భుసిమెట్ట, పవర్‌గూడ, పొలాస తదితర గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు అబ్దుల్‌ముకీద్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీమెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ఈ ప్రాంతానికి సుపరిచయమైన మహిళ అని, ఆమె పేదల కష్టసుఖాలు తెలిసిన మహిళ అని అన్నారు. ముఖ్యంగా పేదలను ఆదుకోవడం కోసం సుగుణ ఎంపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నలిచిందన్నారు. ప్రతిఒక్కరూ మన ఇంటి ఆడ పడుచులాగా ఆమెను గౌరవిస్తూ ఆమెకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెందూర్ ప్రకాష్, సుద్దాల శ్రీనివాస్, సుద్దాల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థినిని సన్మానిస్తున్న కలెక్టర్, అధికారులు

జైనూర్, మే 3: స్థానిక ఆశ్రమోన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థిని జాదవ్‌శ్రీవేణి ఇటీవల నిర్వహించిన పదిపరీక్షలో 9.7మార్కులతో మండలటాపర్‌గా నిలిచింది. దీంతో ఆమెను కలెక్టర్ వెంకటేష్ దోత్రే, గిరిజన సంక్షేమశాఖ అధికారి రమాదేవి, ఏటీడీవో పురుషోత్తం, ఎసీఎంవో పుర్కు ఉద్దవ్, జీసీడీవో శకుంతల తదితరులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో పాఠశాల హెచ్ఎం సోనేరావ్, వార్డెన్ జాదవ్ గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలి

వాంకిడి, మే 3: ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీమెజార్టీతో గెలిపించాలని వాంకిడి జడ్పీటీసీ అజయ్‌కుమార్ కోరారు. శనివారం మండలంలోని ఇందాని తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలోనే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, అశోక్, రాకేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ మోతీరాం అన్నారు. శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ హక్కుల కోసం పోరాడింది బీఆర్‌ఎస్ మాత్రమేనని అన్నారు. ఆయన వెంట జడ్పీటీసీ ద్రుపతాబాయి, వైస్‌ఎంపీపీ కలాం, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలి: ఏఐటీయూసీ



మందమర్రిలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, మే 3: కార్మికులపై యాజమాన్యం పనిఒత్తిడి తగ్గించాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా అన్నారు. న్యూటెక్ గనిలో శుక్రవారం కార్మికులను కలుసుకొని వారి సమస్యలు తెలుసుకున్నారు. రూఫ్ బోల్టుల సమస్య ఉందని, కార్మికుల కొరత ఉందన్నారు. కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, విడిభాగాలు అందుబాటులో లేవన్నారు. వేసవిలో ఓసీపీ, సీహెచ్‌పీ కార్మికుల పనివేళల్లో మార్పులు చేయాలని ఎన్నిమార్లు కోరినా యాజమాన్యం స్పందించకపోవడంతో శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన, సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ సంపత్, పిట్‌కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్టు కార్మిక సంఘం బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు చంద్రమౌళి, వెంకటేశం, అక్రమ్ పాషా, నర్సయ్య, సంపత్‌రావు, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, షాకిర్ పాల్గొన్నారు.

కార్మికుల పనివేళలు మార్చాలి..

మందమర్రిటౌన్: ఎండలు అధికంగా ఉన్నందున కార్మికులపనివేళలు మార్చాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ కోరారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నందున కార్మికులు అస్వస్థతకు గురయ్యే అవ కాశాలున్నాయన్నారు. పనివేళలు మార్చితే కార్మికులకు కొంత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఎండ తీవ్రతతో కార్మికుల హాజరుశాతం తగ్గుతోందన్నారు. లేకపోతే నిరసనలు చేపడతామన్నారు. వెంటనే సింగరేణి యాజమాన్యం పనివేళలు మార్చాలన్నారు. నాయకులు కంది శ్రీనివాస్, దేవసాని సాంబయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



శ్రీరాంపూర్‌లో సంబరాలు చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, మే 3: ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం శ్రీరాంపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ముఖ్యఅతిథిగా యూనియన్ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ హాజరై మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ ద్వారా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, పెన్షన్, గ్రాట్యుటీ, విద్య, వైద్యం, తదితర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాబోయే కాలంలో నూతన బొగ్గు గనులు, అనుబంధ పరిశ్రమలు, పవర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. కార్మిక హక్కుల కోసం తాము నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, ఏరియాకార్యదర్శి శీలం చిన్నయ్య, నాయకులు సిహెచ్. భీంరావు, గరిగ స్వామి, కలవేన శ్యాం, తిరుపతి రెడ్డి, అనిల్, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్టుమెంట్లలో ఐఎన్టీయూసీ 77వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆర్కేపీ సీహెచ్‌పీలో కార్మికుల సమక్షంలో జెండా ఆవిష్కరించి వేడుకలు జరిపారు. ఈసందర్భంగా ఐఎన్టీయూసీ నాయకుడు రాంబాబు మాట్లాడుతూ ఐఎన్టీయూసీ నిత్యం కార్మికుల సమస్యలపై యాజమాన్యాన్ని నిలదీస్తుందన్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌పీ పిట్ సెక్రెటరీ శనిగారపు రాములు, సీనియర్ నాయకులు ఆకుల రాజన్న, గోపతి శ్రీనివాస్, ముస్తఫా, రమేష్ బాబు, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సెలవులొచ్చాయి...పిల్లలు జర జాగ్రత్త

● తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి ● ఎండ తీవ్రతతో అనారోగ్యానికి గురయ్యే అవకాశం
● అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



మంచిర్యాల కలెక్టరేట్, మే 3 : పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో పిల్లలు ఆటాపాటల్లో మునిగిపోతున్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. లేదంటే వేసవి వేడికి చిన్నారులు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయి. వాతావరణం వేడిగా ఉండడంతో పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరగడం, చెమటతో శరీరంలోని నీరు వేగంగా ఆవిరైపోవడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. ఆటల్లో పడి చిన్నారులు ఆకలి దప్పులు మర్చిపోతారు. ఎండ వేడిని సైతం పట్టించుకోరు. అటువంటప్పుడు డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది.

-ఇలా జాగ్రత్తలు పాటించాలి

ఎండ తీవ్రత పెరుగుతున్న క్రమంలో పిల్లలు ఇంట్లోనే ఉండేలా చూసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యాల బారిన పడతారు. పెద్దల తోడు లేకుండా పిల్లలను బావుల్లోకి చెరువుల్లోకి ఈత కోసం పంపించవద్దు. బైక్ నడపడానికి ఇవ్వవద్దు. స్నేహితులతో కలిసి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు అనుమతులు ఇవ్వవద్దు. ఉదయం 11 గంటలు దాటితే బయట తిరగనివ్వవద్దు. యాత్రలకు వెళ్లినప్పుడు స్వయంగా వండుకున్న ఆహారం తినడం మంచిది. పిల్లలు మొబైల్ ఫోన్‌లు, ట్యాబ్‌లు, కంప్యూటర్లకు అలవాటు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి. బయట ఆడుకోవడానికి ఉదయం, సాయంత్రం వేళల్లోనే అనుమతించాలి. పిల్లలకు



ఆసక్తి ఉన్న డ్యాన్స్, ఇతర అంశాలపై శిక్షణ ఇప్పించాలి. రెండు పూటలా స్నానం చేయించి, తెల్లని లేతరంగులు దుస్తులు వేయాలి. ఇంట్లోనే క్యారం, చెస్ ఆటలు ఆడుకునేలా చూడాలి.

-ఆహార జాగ్రత్తలు తప్పనిసరి

వేసవిలో పిల్లలు ఆహారం తీసుకోవడానికి అంతగా ఆసక్తి చూపించరు. చిరుతిండ్లను ఎక్కువగా ఇష్టపడతారు. చల్లని పానీయాలు తాగేందుకు అల్లరి చేస్తారు. పంచదార కలిపిన జ్యూస్‌లు, కంపెనీల కూల్ డ్రింక్‌లు, ఐస్‌క్రీంలు పిల్లలకు ఇవ్వడం వల్ల పిల్లల్లో డీహైడ్రేషన్ ప్రభావం పెరుగుతుంది. పిల్లల ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం ఎండ ఎక్కువ కాకముందే అల్పాహారం అందించాలి. బేకరీ, బయటి పదార్థాలు కాకుండా ఇంట్లోనే అల్పాహారం చేసి అందించాలి. తృణధాన్యాల జావా, మజ్జిగ, పాలను తాగించాలి. అల్పాహారం అనంతరం నిమ్మరసం, ఖర్జూరాలు ఇస్తే జీర్ణశక్తి పెరుగుతుంది. మధ్యాహ్న భోజనంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారం అందించాలి. పాలకూర, ఉల్లి, ముల్లంగి, మామిడి, అనాస, కర్బూజా, పుచ్చకాయ, దోసకాయలు, మజ్జిగ, కొబ్బరి నీరు అందించాలి. ఉప్పు, నూనెలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తగ్గించాలి.

తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి

సాయిస్పృజ, పిల్లల వైద్యురాలు

వేసవి కాలంలో పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎండలు తీవ్రంగా ఉన్నందున బయట ఆడుకోవడానికి పంపించవద్దు. ఇంట్లో చేసిన ఆహార పదార్థాలనే తినిపించాలి. బయటకు వెళ్తామని పిల్లలు మారం చేయకుండా ఇంట్లోనే చెస్, క్యారం తదితర ఆటలు పిల్లలతో కలిసి తల్లిదండ్రులు ఆడాలి. ఇంట్లో కూడా వేడి గాలులు రాకుండా చూసుకోవాలి. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించాలి.

ప్రైవేటు వైపే రైతుల మొగ్గు

● ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా కొనని వైనం
● ఇప్పటికే 10శాతం తరలిపోయిన ధాన్యం

దహెగాం, మే 3: మండలంలో రైతులు వరిధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించడానికే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలరోజులు పూర్తైనా కొనుగోలు చేయడం లేదు. తాలు, తేమ పేరుతో కోతలు విధించడంతోనే రైతులు ధాన్యం విక్రయించడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడం లేదన్న ఆరోపణలున్నాయి. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలు ధాన్యానికి రూ.1800నుంచి రూ.1950చెల్లించి కొనుగోలు చేసి మండలంలోని రైస్ మిల్లులతోపాటు మంచిర్యాల, పెద్దపల్లి రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన వరిపంట తక్కువ ధరకే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని లగ్గాం, ఒడ్డుగూడ, దహెగాం, కమ్మర్‌పల్లి, మర్రిపల్లి, తదితర గ్రామాల్లో వరికోతలు 50శాతం పూర్తయ్యాయి. దంచికొడుతున్న ఎండలకు కొనుగోలు కేంద్రాల వద్ద కనీసవసతులు కల్పించలేదని ఆయాగ్రామాల రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని, సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యం ఇలా..

జిల్లా వ్యాప్తంగా యాసంగి వరిపంటను 15మండలాల్లో ప్రాజెక్టులు, బోర్‌వెల్, నీటివనరులు లభ్యత గల ప్రాంతాల్లో రైతులు సాగు చేశారు. దహెగాం మండలంలో 7350 ఎకరాల్లో పంటను సాగు చేయగా జిల్లాలో 37కొనుగోలు కేంద్రాల ద్వారా 45వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2203, బిగ్రేడ్‌కు రూ.2180 చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.



ధాన్యం కాంటా వేస్తున్న వ్యాపారులు

కానీ మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు మాత్రం చేపట్టడం లేదు.

ప్రైవేటు వ్యాపారులే దిక్కు..

- మోరె గణేష్, రైతు, లగ్గాం

అయిదు ఎకరాల్లో వరిపంట కోసి కల్లాల్లో పోసి పదిహేను రోజులు అవుతోంది. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. చివరికి ప్రైవేటు వ్యాపారులకు రూ.1850కే అమ్ముకున్నాను.

ఎండలతో ఇబ్బందులు పడుతున్నాం..

- మల్లేష్, రైతు, దహెగాం

వరిపంట కోసి పది రోజులు అవుతోంది. వరి ధాన్యంను ఆరబోసి తేమశాతం చూడగా 14శాతం వచ్చింది. మిషన్‌లో తూర్పార పోస్తున్నాం. ఎండలతో చాలా ఇబ్బం దులు పడుతున్నాం. అధికారులు కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలి.

కొనుగోలు చేస్తాం..

- జీవీ నర్సింహారావు, సివిల్ సప్లయి డీఎం

మండలంలోని 9వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించాం. కొనుగోలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఆందోళన చెందవద్దు. రైతులు తేమ, తాలు లేని నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి. ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.

కోటపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోటపల్లి, మే 3: కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరం పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 34 సంవత్సరాల తర్వాత ఒకరికి ఒకరు కలుసుకోవడం, వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడంతోపాటు కష్ట సుఖాలను పంచుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల పరిసర ప్రాంతాల్లో గడిపి విందులు, వినోదాలు, ఆటాపాటలతో గడిపారు. ఉపాధ్యాయులతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

కన్నెపల్లి, మే 3: మహిళలు కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించాలని డీఆర్‌డీవో కిషన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వయోజన విద్యాశాఖ సఖి లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న అక్షరాస్యత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు నిరక్షరాస్యులైన వారికి చదువు నేర్పుతు ఉపాధికి కుట్టుశిక్షణ నేర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు కుట్టే బాధ్యతలను అప్పగిస్తామన్నారు. స్వయం ఉపాధి పొందడం కోసం బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందేలా చూస్తామన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో అర్హులైన వారందరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం, డీఆర్‌పీలు రమేష్, అశోక్‌రావు, శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు శారద, శిక్షకురాలు లిఖిత పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన అధికారులు

తాండూర్, మే 3: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా వివిధ పాఠశాలల్లో జరుగుతున్న పనులను శుక్రవారం జిల్లా సెక్టోరల్ అధికారులు సత్యనారాయణమూర్తి, యశోదరలు పరిశీలించారు. బోయపల్లి, చౌటపల్లి, రేపల్లెవాడ, రేచినిరోడ్డు, కిష్టంపేట, కొత్తపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లోని పనులను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీసీవో ప్రశాంత్, పాఠశాలల చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కూలీలకు మజ్జిగ పంపిణీ

మందమర్రిరూరల్, మే 3: మండలంలోని అందుగులపేటలో ఉపాధిహామీలో పని చేస్తున్న కూలీలకు శుక్రవారం కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి కడారి జీవన్‌కుమార్ మజ్జిగను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ వల్ల దేశానికి ఒరిగిందేమి లేదన్నారు. నాయకులు కుమార్, రాజయ్య, శేఖర్, నాసర్, రాకేష్, కార్తీక్, సందీప్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన

దండేపల్లి, మే 3: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అధిక మెజార్టీతో గెలిపించాలని శుక్రవారం గూడెం, నంబాల, వెల్గనూర్, కాసిపేట, కొండాపూర్, ద్వారక, పెద్దపేట, లక్ష్మీకాంతపూర్ గ్రామాల్లో ప్రచార సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో కొన్ని అమలు చేశామని, ఎన్నికల కోడ్ అనంతరం మిగితావి అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజలకు భరోసా కల్పించారు. ఆగస్టు 15లోపు రైతులకు రూ. 2లక్షల పంట రుణమాఫీ చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తు న్నారన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే సబ్బండ వర్గాలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డు, ఇళ్లు ఇచ్చిన దాఖాలాలు లేవని విమర్శించారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపాలన్నారు. గడ్డం త్రిమూర్తి, వెంకటే శ్వర్లు, శ్రీనివాస్, మోహన్, మణెమ్మ, కమలాకర్, శ్రీనివాస్, రాజమౌళి పాల్గొన్నారు.



వెల్గనూర్ ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మందమర్రిటౌన్: పట్టణంలోని 7,8 వార్డులతోపాటు దొరలబంగ్లా, పాల చెట్టు, పాత బస్టాండ్ ఏరియాలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పం పిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. మహంత్ అర్జున్‌కుమార్, సంగి సంతోష్, పాషా, నేముల ఉపేందర్‌గౌడ్, గడ్డం రజనీ, శ్రీనివాస్, కిరణ్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



మాస శివప్రియ(ఫైల్)

తిమ్మాపూర్, మే 3: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల పరిధిలో ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఫార్మ్ డి కోర్సు చదువు తున్న ఓ విద్యార్థిని శుక్రవారం ఉదయం హాస్టల్ మూడో అం తస్తుపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర గాయాలైన ఆమెను ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. స్థానికులు, ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన మాస శివప్రియ(20) మండల కేంద్రంలోని ఓ కళాశాలలో ఫార్మ్ డి ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నది. శుక్రవారం తెల్లవారు జమున 6 గంటల ప్రాంతంలో శివప్రియ ఆమె ఉంటున్న హాస్టల్ భవనం మూడో అంతస్తు పై నుంచి దూకింది. పెద్దగా చప్పుడు రావడంతో చుట్టు పక్కల వాళ్లు అక్కడికి చేరుకున్నారు. దగ్గరికి వెళ్లి పరిశీలించగా శివప్రియ తలకు తీవ్ర గాయాలతో అపస్మరక స్థితికి చేరుకుంది. వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శివప్రియ తల్లిదండ్రులకు ఏకైక సంతానం. తండ్రి కూడా గతంలో మృతి చెందగా తల్లి లక్ష్మి బెల్లంపల్లిలో నర్స్‌గా పని చేస్తూ కూతురిని చదివిస్తోంది. ప్రస్తుతం శివప్రియకు మిడ్ ఎగ్జామ్స్ అవుతున్నాయి. గురువారం కూడా ఆమె పరీక్షకు హాజరు కాలేదని చెబుతున్నారు. శుక్రవారం ఈ సంఘ టన చోటుచేసుకుంది. ఫస్ట్ ఇయర్‌లో ఒక్క సబ్జెక్టులో ఫెయిల్ అయినట్లు సమాచారం. కాగా ఆమె ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. శివప్రియ తల్లి లక్ష్మి మాత్రం తమ కూతురికి పరీక్షలు అంటే భయమని, బాగా రాస్తానో లేదో అనే భయంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని పోలీ సులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

ఓటు హక్కును ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలి

బెల్లంపల్లి, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏసీపీ రవికుమార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలో పోలీసులు, కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ప్రజలందరు పోలీసులకు సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాకేష్‌మిశ్రా, రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, ఎస్ఐలు రమేష్, డి. రమేష్, నరేష్, కేంద్ర బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

దండేపల్లి: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నట్లు లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ అన్నారు. మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో బస్టాండ్ నుంచి హైస్కూల్ వరకు కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలన్నారు. ఓటు వినియోగించుకునేందుకు భరోసాగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడద్దని సూచించారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకొని పోలీసులకు సహకరించాలన్నారు. దండేపల్లి, లక్షెటిపేట ఎస్సైలు లింగంపల్లి భూమేష్, పెట్టెం చంద్రర్‌కుమార్, పోలీసు, సాయుధ బలగాలు పాల్గొన్నారు.



బెల్లంపల్లి, దండేపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

దేశంలో బీజేపీ ద్వారా అభివృద్ధి

● పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గోమాసే

నస్పూర్, మే 3: దేశం మరింత అభివృద్ధి సాధించాలంటే నరేంద్ర మోదీ నాయకత్వం ద్వారానే జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గోమాసే అన్నారు. శుక్రవారం రాత్రి రోడ్‌షోను సీసీసీ కార్నర్ నుంచి శ్రీరాంపూర్ బస్టాండ్ వరకు సాగింది. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మోదీ చాలా పథకాలను అమలు చేసి అభివృద్ధికి కృషి చేశారని, ప్రస్తుతం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ నాయకత్వంలో బీజేపీని గెలిపించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వెర బెల్లి రఘునాథ్, నాయకులు రజనీ జైన్, అందుగుల శ్రీనివాస్, బొలిశెట్టి తిరుపతి, రామకృష్ణ, కమలాకర్‌రావు, సదానందం, రవనవేని శ్రీనివాస్, సాప్రాజ్ రమేష్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: పెద్దపల్లి ఎంపీగా తనను గెలిపిస్తే సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను మాఫీ చేయిస్తామని బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే అన్నారు. ఆయన ఆర్‌కె5 గనిపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఏడాది సింగరేణి కార్మికులు కోట్లాది రూపాయలు ఆదాయపు పన్ను రూపేణా చెల్లిస్తున్నారని, వాటిని మాఫీ చేయించేందుకు పార్లమెంట్‌లో పోరాడుతానని అన్నారు. యాదగిరి సత్తయ్య, అశోక్, రమేష్, ఈర్ల సదానందం, సదయ్య, చక్రవర్తి, పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని నాగార్జునక్వార్టర్స్‌లో బీజేపీ నాయకులు గడప గడపకు ప్రచారం నిర్వహించారు. వేముల అశోక్, కట్ల ఈశ్వర్‌చారి, మాసు సత్యనారాయణ, బంగారు వేణుగోపాల్, వైద్య శ్రీనివాస్, పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని ప్రధానమార్కెట్ ఏరియాలో ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. వ్యాపారులు, ప్రజల వద్దకు వెళ్లి కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి కోడి రమేష్, తిరుపతి, గోవర్ధన్, రాజులాల్‌యాదవ్, అజ్మీర శ్రీనివాస్, దూది ప్రకాష్, కొండబాబు, పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా మండల కార్యవర్గం



నియామక పత్రాన్ని అందజేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు, నాయకులు

దండేపల్లి, మే 3: దండేపల్లి గ్రామా నికి చెందిన వనపర్తి రాకేష్, ముత్యం పేట గ్రామానికి చెందిన తోట రమణ య్యలు కిసాన్ మోర్చా అధ్యక్ష కార్యద ర్శులుగా నియమితులయ్యారు. బీజేపి జిల్లా అధ్యక్షుడు వెరవెల్లి రఘనాథ్ ఆదే శాల మేరకు శుక్రవారం పార్టీ కార్యాల యంలో నియామక పత్రాన్ని పార్టీ మం డల అధ్యక్షుడు గోపతి రాజయ్య అం దజేశారు. రవిగౌడ్, చుంచు గిరిధర్, గుండ రవిందర్, వంశీ, రమేష్, సింగని రాయలింగు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

● ఎమ్మెల్సీ దండే విఠల్



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

పెంచికలపేట, ఏప్రిల్ 3: మండలకేంద్రంలో ఈనెల5న ఆదివారం సాయంత్రం నిర్వహించనున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్యనేతలు, కార్యకర్తల ఆత్మీయసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. శుక్రవారం సమావేశ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సమావేశానికి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్ర మంలో నాయకులు శ్రీనివాస్, ఎన్.శ్రీనివాస్, కృష్ణ, శంకర్ గౌడ్, కె శ్రీనివాస్, తిరుపతి, మహేష్, చిన్నయ్య, శ్రీకాంత్, శేఖర్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తాం

● సివిల్ సప్లయి డీఎం నర్సింహారావు



వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయి డీఎం నర్సింహారావు

దహెగాం, మే 3: ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువస్తే కోతలు విధించకుండా కొనుగోలు చేస్తామని సివిల్ సప్లయి డీఎం నర్సింహారావు అన్నారు. శుక్రవారం మండలంలోని లగ్గాం, దహెగాం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు ప్రభుత్వ నిబంధలు తప్పకుండా పాటించాలన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించిన తరువాత మిల్లర్లు కోతలు విధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యాన్ని కాంటా వేసిన వెంటనే రైతులకు రశీదులు అందజేయాలని సూచించారు. ఆయన వెంట సీఈవో బక్కయ్య, తదితరులు ఉన్నారు.

దుకాణాలకు వేలం

సిర్పూర్(టి), మే 3: మండల కేంద్రంలోని దర్గావద్ద ఈ నెల18,19తేదీల్లో నిర్వహించే ఉర్సు ఉత్సవాల్లో భాగంగా దుకాణాల ఏర్పాటుకు శుక్రవారం సాయంత్రం వేలం పాట నిర్వహించారు. ఈవేలం పాటలో మండల కేంద్రానికి చెందిన ఇస్మాయిల్ రూ.85వేలకు స్వీట్ హోటల్, రూ.25 వేలకు టీస్టాల్‌తో పాటు ఇతర దుకాణాలను దక్కించు కున్నారు.

కాంగ్రెస్ అసత్యాలు ప్రచారం చేస్తోంది: ఎమ్మెల్యే హరీష్‌బాబు

పెంచికలపేట, మే 3: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాటలను వక్రీకరించి కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని బొంబా యిగూడ, పోతెపల్లి, చెడ్వాయి, దర్గపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలులో ప్రజలకు మొండిచేయి చూపిందని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. దేశం కోసం, ధర్మం కోసం బీజేపీ పోరాడుతుందని దానికి నిదర్శనమే అయోధ్యలో భవ్యరామ మందిర నిర్మాణమన్నారు. పెంచికలపేట పెద్దవాగుపై రెండో వంతెన నిర్మించి ఎల్కపల్లి, లగ్గాం వరకు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తామని ఆయనహామీ ఇచ్చారు. ఎర్రగుంట గ్రామానికి రూ.1.50కోట్లతో లో లెవల్ వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణ, మధుకర్, మహేష్, నాగేష్, పెంటయ్య, భీమయ్య, కాంతారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీష్‌బాబు ఇంటింటి ప్రచారం

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ సర్‌సిల్క్ వార్డు నెం.1లో శుక్రవారం ఉదయం బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అధికమెజార్టీతో గెల్పించాలన్నారు. బీజేపీ అభ్యర్థిని గెల్పిస్తే సిర్పూరు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట కార్యకర్తలు, నాయకులున్నారు.

బీజేపీలో పలువురికి చేరిక

కాగజ్‌నగర్ టౌన్: పోతపల్లి గ్రామానికి చెందిన కొంతమంది బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి అంతా కృషి చేయాలన్నారు. త్వరలో జరిగే ఎంపీఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అధిక మెజార్టీతో గెల్పించాలని కోరారు.



కాగజ్‌నగర్ సర్‌సిల్క్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు

అభ్యర్థుల ఖర్చులపై ఈసీ నజర్

● పరిమితి దాటితే అనర్హత వేటు

కాగజ్‌నగర్, మే 3: నామపత్రాల దాఖలు పర్వం పూర్తి కావటంతో లోక్‌సభ ఎన్నికల జోరు మరింతపెరిగింది. అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేయటానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు అభ్యర్థుల ఖర్చు మద్యం, డబ్బు, ఇతరాత్ర పంపిణీ ఎన్నికల నియమావళి ఉల్లంఘనులనుఎప్పటికప్పుడు కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలు జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల్లో నీడలా వెంటాతున్నాయి. ప్రతివిషయాన్ని కూడా పరిశీలిస్తూ అడుగడునా వారి వెంటే ఉంటూ నిరంతం పర్యవేక్షిస్తున్నాయి.

నిఘా చేస్తున్న బృందాలివే..

మోడల్ కోడ్‌ఆఫ్‌కండక్ట్(ఎంసీసీ) బృందాలు ప్రతి నియోజకవర్గంలో మండలానికి ఒకటి నియమించారు. ఒక్కోబృందంలో నలుగురు అధికారులుంటారు. బృందబాధ్యుడిగా ఒక గెజిటెడ్‌అధికారి, ఇద్దరు పోలీస్ సిబ్బంది, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. వీరంతా అభ్యర్థుల ప్రచారఖర్చులపై నిఘా ఉంచుతారు. అలాగే లోక్‌సభ నియోజవర్గంలో ప్రతి అసెంబ్లీ సెగ్మెంటులో మూడు స్టాటిస్టిక్ సర్వేలెన్స్ బృందాలు(ఎస్ఎస్‌టీ) ఏర్పాటు చేశారు. డిప్యూటీతహసీల్దార్ బృందానికి బాధ్యుడిగా కేటాయించారు. ముగ్గురు పోలీస్‌అధికారులు, రెవెన్యూ, అబ్కారీఅధికారి, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. మొత్తం ఎనిమిది మందితో కూడిన బృందం డబ్బు, మద్యం, ఇతర వస్తు సామగ్రి తరలింపులపై దృష్టి సారించనున్నారు. వీటితోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ లోక్‌సభస్థానం పరిధిలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంటులో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం బృందాలుగా నియమించారు. ఒక్కొక్కశాఖకు చెందిన అధికారి, ఒక వీడియో గ్రాఫర్ ఉంటారు. వీరు24గంటల పాటు షిఫ్టుల వారీగా పని చేస్తారు. డబ్బు మద్యంతో ఓటర్లను మభ్యపెట్టేందుకు అవకాశం ఉండటంతో వాటిని నియంత్రించేందుకు ప్రత్యేక నిఘాపెట్టనున్నాయి. వీటితోపాటు అకౌంటింగ్ టీం(ఏటీ), వీడియో సర్వేలైన్స్ టీం, వీడియో వ్యూయింగ్‌టీంలను కూడా ఏర్పాటు చేశారు. ఇందులో కూడా వీడియో సర్వేలెన్స్ బృందం ఉంటుంది. ఒక రెవెన్యూ, ఒక పోలీస్ అధికారి సమక్షంలో ఈ బృందాలు తిరిగి అభ్యర్థుల వెంట ఉండి రికార్డు చేస్తుంటాయి.



అభ్యర్థుల ఖర్చులపై రికార్డు చేసే వీడియో కెమెరా

ప్రచారాల తీరును రికార్డు చేస్తున్నాం..

-సురేష్, ఆర్డీవో, కాగజ్‌నగర్

నిఘా విభాగాలకు చెందిన టీంలను అన్ని మండలాల్లో తిరుగుతున్నాయి. అలాగే పట్టణానికి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నాం. ప్రతి అంశం రికార్డు అవుతోంది. ఫిర్యాదు వచ్చిందంటే వెంటనే రంగంలోకి దిగి చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అంతా సహకరించాలి.

లెక్కకు మించితే వేటే..

వాంకిడి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లోకసభ స్థానాల ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ఖర్చులపై ఎన్నికల సంఘం కన్నేసింది. అభ్యర్థులు ప్రచారంలో భాగంగా సభలు, ర్యాలీలు నిర్వహణ, భోజనాలు, వాహనాలు, తదితర ఖర్చులు ఉంటాయి. అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రత్యేక తనిఖీ బృందాలు ఆ ఖర్చులను లెక్కకడుతున్నాయి.

వ్యయపరిమితి రూ.95లక్షలు

లోకసభ అభ్యర్థి ఎన్నికల ప్రచార నిమిత్తం ఈసీ వ్యయపరిమితిని రూ.95 లక్షల వరకు నిర్ణయించింది. ఆ పరిమితి దాటి ఖర్చుచేయొద్దు. నామినేషన్ దాఖలు చేసిన నాటినుంచి ఎన్నికల ఖర్చులు లెక్కిస్తారు. అభ్యర్థి ఏదైనా జాతీయ బ్యాంకులో నూతనఖాతాలు తెరిచిదానిద్వారా లావాదేవీలు నిర్వహించాలి. ఫలితాలు వెల్లడించిన తేదీనుంచి 30రోజుల్లోపు అభ్యర్థులు తమ పూర్తి ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. పరిమితికి మించి ఖర్చు చేసినా, లెక్కలు చూపకున్నా సంబంధిత అభ్యర్థిపై వేటుపడటంతోపాటు తర్వాత ఎన్నికల్లో పోటీచేసే హక్కును కోల్పోతారు.

ఓటు హక్కును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాగజ్‌నగర్, మే 3: త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్ రూం వద్ద 24 గంటల పాటు బందోబస్తు నిర్వహించాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో సురేష్, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

చెన్నూరు, మే 3 : మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలో శుక్రవారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గోమాసేను గెలిపించాలని ప్రజలను కోరారు. కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల ఇన్‌కంటాక్స్ తిరిగి చెల్లిస్తాం

● ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వివేకానంద



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

ఏసీసీ, మే 3: సింగరేణి కార్మికులు ప్రభుత్వానికి చెల్లించిన ఆదాయ పన్నును తిరిగి చెల్లించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఒప్పుకున్నారని, త్వరలోనే ప్రకటన చేస్తారని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇండియా కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణ ఏర్పడే నాటికి సింగరేణిలో 62 వేల ఉద్యోగాలు ఉండగా నేడు అవి 32 వేలకు తగ్గాయన్నారు. సింగరేణి నిధుల నుంచి రూ.20 వేల కోట్లను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కదారి పట్టించినా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పట్టించుకోలేదని విమర్శించారు. సింగరేణి కార్మికుల సొం తింటి కలను త్వరలోనే సాకారం చేస్తామని, కార్మికుల ఇన్‌కంటాక్స్ రీయింబర్స్‌మెంట్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఒప్పుకున్నారన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సింగరేణి కార్మికులకు చేసిందేమి లేదని, సిం గరేణిలో 23 వేల ఉద్యోగాలు తొలగిస్తే కార్మికుల తరుపున ఏనాడు మాట్లాడలేదని విమర్శించారు.

పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ సింగరేణి ద్రోహి కేసీఆర్ అన్నారు. పదేండ్లుగా సింగరేణి సంస్థ, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదన్నారు. కార్మికుల సొంతింటి నిర్మాణానికి ఒక్కో కార్మికునికి రూ.10 లక్షలు, భూమి కేటాయిస్తామని చెప్పి అనంతరం స్థలం లేదని కార్మికులను మోసగించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటు సంస్థలకు అమ్మిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగరేణికి అన్యాయం చేసిందన్నారు. సింగరేణి కార్మికుల క్వార్టర్లను కార్మికులకు ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నాయకులకు అక్రమంగా కేటాయించారన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టగానే కార్మికుల ప్రమాదబీమా పథకాన్ని అమలు చేశారన్నారు. సింగరేణి మూతపడే సమయంలో కాకా వెంకటస్వామి సంస్థను మూత పడకుండా కాపాడి లక్ష మంది ఉద్యోగులు రోడ్డున పడకుండా ఆదుకున్నారన్నారు. ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ వాసిరెడ్డి సీతారామయ్య, టీజేఎస్ నాయకుడు బాబన్న, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్, సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది

కాసిపేట: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మకానికి పెట్టి ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్నాడని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ అన్నారు. కాసిపేట గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. దేశ సంపదను కొందరికే పరిమితం చేస్తూ కేంద్రం అనేక నల్ల చట్టాలను అములులోకి తెచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బడుగు, బలహీన వర్గాలపై దాడులు మరింత పెరుగుతాయన్నారు. వాసిరెడ్డి సీతారామయ్య కార్మికులందరు గడ్డం వంశీని గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు, బెల్లంపల్లి ప్రజలు ఎమ్మెల్యేలుగా గెలిపించారని, పార్లమెంట్ ఎన్నికల్లో గడ్డం వంశీని గెలిపించాలన్నారు. మిట్టపల్లి వెంకటస్వామి, అక్బర్ అలీ, చిప్ప నర్సయ్య, సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, రత్నం ప్రదీప్, పాల్గొన్నారు.

ఉపాధిహామీ పని స్థలాల వద్దకు వెళ్లి ఓట్లు అడిగారు. ముత్యంపల్లి పంచాయతీ గురువాపూర్‌లో కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. పల్లంగూడలో ట్రాక్టర్ నడుపుతూ ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి కూలీలను ఓట్లు వేయాలని కోరారు.

బీజేపీ పాలనలో పారిశ్రామిక విధ్వంసం

మందమర్రిటౌన్: పదేండ్ల బీజేపీ పాలనలో పారిశ్రామిక విధ్వంసం పెరిగిపోయిందని, జాతీయ పరిశ్రమలను ప్రైవేటుపరం చేశారని, నిరుద్యోగం పెరిగిందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ధ్వజమెత్తారు. సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు, ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు రావికంటి వెంకటేశం అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. వంద రోజులు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేశామన్నారు. బీఆర్‌ఎస్ కుంభకోణాలు తప్ప ప్రజలకు ఏమి చేయలేదన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. దుర్గం నరేష్, గుడ్ల రమేష్, నామిని ముత్తయ్య, మంద తిరుమల్, పాల్గొన్నారు.

పట్టణంలోని నార్లాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు గుం ట శ్రీశైలం కాంగ్రెస్‌లో చేరారు. ఆయన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి కం డువాలు కప్పి ఆహ్వానించారు. పట్టణం లోని మార్కెట్ ఏరియాకు చెందిన టీఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు శంకర్, శ్రీనివాస్, ఓదెలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అదనపు బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మే 3: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈ నెల 13న జరిగే పోలింగ్ కోసం అదనపు బ్యాలెట్ యూనిట్లను అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ర్యాండమైజేషన్ చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి మంచిర్యాల, చెన్నూరు రిటర్నింగ్ అధికారులు రాములు, చంద్రకళ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం ర్యాండమైజేషన్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో 42 మంది అభ్యర్థులు పోటీల్లో ఉండడంతో అదనపు బ్యాలెట్ యూనిట్లు అవసరం ఉన్నందున ఈసీఐఎల్ కంపెనీ నుంచి జిల్లాకు చేరుకున్న 1800, అదనపు బ్యాలెట్ యూనిట్లతోపాటు పాతవి 88లో 12 యంత్రాలతో సమస్య ఉన్నందున మిగిలిన 76 ఈవీ ఎంలను కలుపుకుని ర్యాండమైజేషన్ చేశామని తెలిపారు.



ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాలకు 575 చొప్పున, మంచిర్యాల నియోజకవర్గానికి 726 కేటాయించామన్నారు. ఆయా సెగ్మెంట్లకు కేటాయించిన ప్రకారంగా బందోబస్తు ఏర్పాట్ల మధ్య తరలించి స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చి 24 గంటల పాటు బందోబస్తు ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి స్ట్రాంగ్‌రూంలను తరలించి భద్రపరిచే ప్రతి కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల ప్రమేయం ఉంటుందని తెలిపారు. అనంతరం డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. పోలింగ్ కోసం 741 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించామన్నారు.ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13న పోలింగ్ జరుగుతుందని, అత్యవసర సేవలు అందిస్తున్న వారు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఇందుకోసం ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 8 వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధి నివారణపై అవగాహన

మంచిర్యాల కలెక్టరేట్, మే 3: ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తలసేమియా సికిల్‌సెల్ వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు పెళ్లికి ముందు హెచ్‌బీఏ2 రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రతీ 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరుగురు తలసేమియా వ్యాధిగ్రస్తులకు బోన్ మ్యారో మార్పిడి ద్వారా వ్యాధి నయం చేస్తామని, ప్రతి పేషెంటు ముందుకు వచ్చి బోన్ మ్యారో మార్పిడి చేయించుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమాజూలియట్, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, లెక్చరర్ పద్మ, సొసైటీ సభ్యుడు మహేందర్, సత్యపాల్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో : ట్రాఫిక్ మళ్లింపు

ఏసీసీ, మే 3: మంచిర్యాల పట్టణంలో శనివారం సాయం త్రం మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షో, ఐబీ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్ ఆంక్షలు విధించినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి, ప్రజలకు ఇబ్బం దులు కలుగకుండా ఉండడానికి కేసీఆర్ రోడ్‌షోకు వచ్చే వాహనాలను పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్, దేవాపూర్, కాసిపేట నుంచి వాహనాలను బస్టాండ్ పక్కన జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో పార్కింగ్ చేయా లన్నారు. లక్సెట్టిపేట, హాజీపూర్ నుంచి వచ్చే వాహనాలను పాత మంచిర్యాల సమీపంలో రాళ్లవాగు పక్కన జీఎస్ఆర్ వెంచర్‌లో పార్కు చేయాలన్నారు. చెన్నూరు, శ్రీరాంపూర్, జైపూర్ నుంచి వచ్చే వాహనాలను ఓవర్ బ్రిడ్జి సమీపంలోని బృందావన కాలనీ శివాజీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేయాలన్నారు. చెన్నూరు, గోదావరిఖని, జైపూర్ నుంచి వచ్చే వాహనాలు మంచిర్యాల వైపు రాకుండా జీఎం ఆఫీస్ జంక్షన్ నుంచి నేషన్ హైవే మీదుగా బెల్లంపల్లి వైపు వెళ్లాలన్నారు.

లక్సెట్టి పేట, హాజీపూర్ వైపు నుంచి బెల్లంపల్లి, శ్రీరాంపూర్, జైపూర్, గోదావరిఖని వైపు వెళ్లే వాహనాలు వయా బైపాస్‌రోడ్డు గద్దె రాగడి క్యాతనపల్లి మీదుగా హైవే పై నుంచి వెళ్లాలన్నారు. బెల్లంపల్లి, మందమర్రి నుంచి చెన్నూరు, గోదావరిఖని వైపు వెళ్లే వాహనాలు మంచిర్యాల పట్టణం మీదుగా కాకుండా గద్దెరా గడి, క్యాతనపల్లి మీదుగా హైవే పై నుంచి వెళ్లాలని సూచించారు. మంచిర్యాల, బెల్లంపల్లి, గోదావరిఖని వైపు వెళ్లే వాహనాలు గద్దెరాగడి, క్యాతనపల్లి మీదుగా ఎన్‌హెచ్ హైవే పై నుంచి వెళ్లాలని, హాజీపూర్ వైపు వెళ్లే వాహనాలు లక్ష్మీథియేటర్ బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లాలని సూచించారు.

కళాశాల తరలించకుండా చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఏసీసీ, మే 3: లక్సెట్టిపేటలోని ఉమామహేశ్వరి ప్రైవేటు కళాశాలను ఇంటర్ బోర్డు అనుమతి లేకుండా యాజమాన్యం హైదరాబాద్‌కు తరలించే ప్రయత్నాలు చేస్తుందని అధికారులు అడ్డుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. శుక్ర వారం జిల్లా కేంద్రంలోని ఇంటర్ విద్యాశాఖ కార్యా లయంలో డీఐఈవో శైలజకు వినతిపత్రం అందిం చారు. వారు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి కళాశాలను హైదరాబాద్‌కు తరలించేందుకు పూనుకుంటుంద న్నారు. అర్థాంతరంగా కళాశాలను తరలిస్తే విద్యా ర్థుల సప్లిమెంటరీ పరీక్షల విషయంలో సర్టిఫికెట్లు విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంద న్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కళాశాలను తరలించకుండా చూడాలని కోరారు. ఐక్య విద్యార్థి నాయకులు రాథోడ్, యువరాజ్, గోపాల్, రాజేష్, వంశీ, ప్రవీణ్, శ్రీను పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల్లో అంతర్గత సాగుతో లాభాలు



ఆయిల్‌పామ్ పంట వద్ద రైతులు



ఆయిల్‌పామ్ తోటలో అంతర పంట సాగు

జన్నారం, మే 3 : మండలంలో ఆయిల్‌పామ్ పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని దేవుని గూడ, కామన్‌పల్లి, శ్రావన్‌పల్లి తదితర గ్రామాల్లో 132 ఎక రాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఆయిల్‌పామ్‌తో పాటు అంతర్ పంటలు వేయడం వల్ల రైతులు నష్టపోకుండా గట్టెక్కుతున్నారు.

రెండేళ్ళ నుంచి మండలంలో 132 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. మొదట్లో మొక్కజొన్న వేయడంతో దెబ్బతినే పరిస్థితి నెలకొంది. దీంతో వ్యవసాయాధికారుల సూచనల మేరకు గత సం వత్సరం నుంచి పత్తి, పెసర వంటి పంటలను సాగు చేస్తున్నారు. ఆయిల్‌పామ్ చెట్లు నాటిన నుంచి మూడు సం వత్సరాలకు దిగుబడి ప్రారంభమైనప్పటికీ చెట్టు ధృడంగా తయారయ్యేందుకు 5 సంవత్సరాలు పడుతుందని, అప్పటి నుంచి దిగుబడి తీసుకుంటే ఎక్కువ కాలం వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఆయిల్‌పామ్ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. టన్నుకు రూ. 13 వేలు ఉంది. నాటిన మూడు సంవత్సరాలకే కొద్ది కొద్దిగా దిగుబడి వస్తుంది. జిల్లాకు కొనుగోలు కంపెనీలను కేటాయించడంతో పంట దిగుబడి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

అంతర్ పంట వల్ల నష్టం లేదు

దుర్గం గోపాల్‌రెడ్డి



ఆయిల్‌పామ్ సాగుతో పాటు అంతర్ పంటను సాగు చేస్తున్నాను. అంతర్ పంట ద్వారా దిగుబడి వస్తుంది. అంతర పంటగా పత్తి సాగు చేశాను. పత్తి దిగుబడి మంచిగా వచ్చింది.

మంచి డిమాండ్ ఉంది : మైపాల్‌రెడ్డి



ఆయిల్‌పామ్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం, అధికారులు సూచనలు చేయడంతో సాగు చేశాను. దీంతో ఇప్పటికి రెండేండ్లు గడిచిపోయాయి. ఇంకో రెండేండ్లలో పంట వస్తుందని ఆశిస్తున్నాను. ఆశించిన దిగుబడి వస్తే ఎలాంటి ఢోకా ఉండదు.

రైతులకు సూచనలు ఇస్తున్నాం : ఏఈవో అక్రం



ఆయిల్‌పామ్ సాగుతో పాటు అంతర పంట వేసే రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నాం. దీంతో రైతులు అంతర పంట వేసి మంచి దిగుబడి సాధిస్తున్నారు. దిగుబడి వచ్చేంత వరకు అవగాహన కల్పిస్తున్నాం.

భగ్గుమన్న సూరీడు

జిల్లాలో 46.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

మంచిర్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో శుక్రవారం 46.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హాజీపూర్ మండలంలో అత్యధికంగా 46.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా నస్పూర్ మండలంలో 46.2 డిగ్రీలు, భీమారం 45.8 డిగ్రీలు, జన్నారం 45.6 డిగ్రీలు, దండేపల్లి 45.5 డిగ్రీలు, చెన్నూరు 45.3 డిగ్రీలు, కాసిపేట 45.2 డిగ్రీలు, వేమనపల్లి 45.2 డిగ్రీలు, మంచిర్యాల, కోటపల్లి 45.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా ఆయా మండలాల్లో రెడ్ అలర్ట్ జారీ అయ్యాయి. బెల్లంపల్లి మండలంలో 44.7 డిగ్రీలు, లక్సెట్టిపేట మండలంలో 44.5 డిగ్రీలు, నెన్నెల మండలంలో 44.3 డిగ్రీలు, కన్నెపల్లి మండలంలో 44.2 డిగ్రీలు, జైపూర్ మండలంలో 44 డిగ్రీలు, భీమిని మండలంలో 43.9 డిగ్రీలు, మందమర్రి మండలంలో 43.4 డిగ్రీలు, తాండూరు 42.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆయా ప్రాంతాల్లో వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

నేడు 5కే రన్

మంచిర్యాల కలెక్టరేట్, మే 3: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఓటరు చైతన్యంపై శనివారం 5కే రన్ జరుగుతుందని డీఆర్‌డీవో కిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5గంటలకు 5కే రన్ ఉంటుందని, యువతీ, యువకులు, మహిళలు, ప్రజలు, ఉద్యోగులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీవో రాధ

భీమారం, మే 3: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాథోడ్ రాధ, స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్యలు పేర్కొన్నారు. శుక్రవారం భీమారంలో పర్యటించి మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ వేసవికాలం పూర్తయ్యే వరకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ కమిటీల్లో ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకొంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటర్లందరికి ఓటరు స్లిప్పులను సకాలంలో అందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ర్యాంపు, మూత్రశాలలు విద్యుత్ తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామారావుపేట శివారులో అక్రమంగా మట్టి తవ్వకాలు

జైపూర్, మే 3: మండలంలోని రామారావుపేట శివారులో అనుమతులు లేకుండా మట్టి అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న పెట్రోలు బంకు వెనుక ఉన్న పంట పొలాల నుంచి రెండు రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి అక్రమంగా రవాణా జరుగుతోంది. దీనిపై మైనింగ్ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డిని వివరణ కోరగా రామారావుపేట శివారులో కేవలం ఒక క్వారీకి మాత్రమే అనుమతులు ఉన్నాయని, అనుమతులు లేకుండా మట్టి రవాణా జరుగుతున్న విషయం తమ దృష్టికి రాలేదని, తమ సిబ్బందిని పంపి అక్రమ రవాణాను అడ్డుకుంటామని పేర్కొన్నారు.

పశువైద్య కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి రమేష్‌కుమార్

హాజీపూర్, మే 3: హాజీపూర్, ముల్కల్ల, రాపల్లి గ్రామాల్లోని పశు వైద్య కేంద్రాలను శుక్రవారం జిల్లా పశువైద్యాధికారి రమేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరంలో ఎండలు ఎక్కువగా ఉన్నందున పశువులను ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు మేతకు పంపించాలని సూచించారు. వడ దెబ్బ తగిలిన పశువులను చల్లని గాలినిచ్చే ప్రదేశంలోకి తీసుకు వెళ్లి పలు మార్లు నీటితో కడగాలని సూచించారు. పశు వులపై తడిసిన గోనె సంచులను కప్పాలని, వైద్యం కోసం పశువైద్యాధికారి సంప్రదించాలన్నారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినం

మంచిర్యాల కలెక్టరేట్, మే 3: మంచిర్యాలలో ఐఎన్‌టీయూసీ 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కనీస వేతనాల బోర్డు ఛైర్మన్ జనక్‌ప్రసాద్ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ 3 కోట్ల 30 లక్షల మంది సభ్యత్వంతో ప్రపంచంలోనే అది పెద్ద కార్మిక సంఘంగా ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో నరేందర్, ప్రతాప్, సమ్మయ్య, భూమయ్య, శ్యాం, నర్సింగ్‌రవి, శ్రీనివాస్, తిరుపతి, శంకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

జన్నారం, మే 3: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన దుర్గం అనసూర్య కుటుంబానికి శుక్రవారం బీజేపీ నాయకులు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. నాయకులు మాట్లాడుతూ అనసూర్య భర్త గతేడాది మృతి చెందగా ఇద్దరు పిల్లలు, అత్తను పోషించడానికి ఇబ్బందులు పడుతుండడాన్ని గ్రహించి ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. నరేష్, దేవేందర్, సాయికుమార్, మహేష్, రాజేష్‌ప్రశాంత్, సత్తన్నమల్లేష్, వెంకటేష్, నాగరాజు, సతీష్ ప్రవీణ్, చందు, శ్రావణ్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, మే 3: పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులను కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ బదావత్ సంతోష్ అభినందించి సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ హనిస్సి, రిజిత్‌యాదవ్‌లు 10 జీపీఏ సాధించడం ఆనందంగా ఉందన్నారు. డీఈవో యాదయ్యప్రిన్సిపాల్ రజనీ పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి

కన్నెపల్లి, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు చరణ్, మండల నాయకులు వెంకటేష్, మనోహర్‌లు పేర్కొన్నారు. కన్నెపల్లిలో శుక్రవారం మాట్లాడుతూ బీజేపీ పదేళ్లలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, అధిక ధరలతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. ఎన్ని కల్లో బీజేపీ ఓడించి తగినగుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు గణేష్, భీమేష్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.